క్లుప్తంగా

హెల్మెట్ వినియోగం తప్పనిసరి


కొనకనమిట్లలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై

కొనకనమిట్ల: టూ వీలర్స్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై మాధవరావు సూచించారు. బుధవారం సాయంత్రం కొనకమనిట్ల సమీపంలో పలు వాహనాలను తనిఖీ చేసి, ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

వీఆర్ఏల సంఘ నూతన కమిటీ ఎన్నిక


వీఆర్ఏల సంఘ నూతన కమిటీ

కొమరోలు: వీఆర్ఏల సంఘం మండల నూతన కమిటీని జిల్లా వీఆర్ఏల సంఘ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అధ్యక్షతన బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక ఓ ప్రైవేటు నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షునిగా పుట్టా వీరాంజనేయులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. ఉపాధ్యక్షులుగా జాజం రాజేశ్వరి, సయ్యద్ హబీబాలను, కార్యదర్శిగా విజయ్‌బాబు, కోశాధికారిగా ఆంథోని, భారతిని ఎన్నుకున్నట్లు చెప్పారు. వీరందరికీ జిల్లా కమిటీ తరఫున అభినందనలు తెలుపుతున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన


పూజల్లో పాల్గొన్న మహిళలు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో కోటి కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. ఉభయదాతలు మేడా నరసింహారావు, రమాదేవి దంపతులను మేళతాళాలతో ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. అమ్మవారి అనుగ్రహం కోసం సామూహిక కోటి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చక సలహాదారు మురళీకృష్ణమాచార్యులు చెప్పారు. పూజల అనంతరం భక్తులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, ఎస్.నాగేశ్వరరావు, పి.భాస్కర్, వెలిశెట్టి నారాయణ, సామి రాజా తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాలలో కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శివసదనం అతిథి గృహంలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరానికి నంద్యాల శాంతిరామ్ వైద్యశాలకు చెందిన వైద్యులు నాగార్జున, సమీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు కంటి పరీక్షలు చేశారు. నిర్వాహకులు బషీర్‌ఖాన్, పూల బాబు, అబ్దుల్ సమద్, మాజీద్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదానం


భోజనం వడ్డిస్తున్న ఉభయదాతలు

పొదిలి: అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప దేవాలయం వద్ద ప్రతి బుధవారం అన్నదానం చేస్తున్నారు. పరిమి చిన్న నాయుడు, చిన్న సుబ్బులు, శివయ్య, లీల దంపతులు ఉభయదాతలుగా బుధవారం అన్నదానం చేశారు. అర్చకులు మురళీకృష్ణామాచార్యులు పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు యక్కలి శేషగిరిరావు, అప్పల శంకర్, రామాపురం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు వినియోగిస్తే కఠిన చర్యలు


ర్యాలీలో పాల్గొన్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రెహమాన్


అవగాహన ర్యాలీ చేస్తున్న పోలీసులు

మార్కాపురం టౌన్: డ్రగ్స్ వాడితే చట్ట ప్రకారం కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని సీనియర్ న్యాయవాది ఉషశ్రీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిరోధక దినం సందర్భంగా మండల న్యాయ సేవాధికారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సిద్ధార్థ జూనియర్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత మాదక ద్రవ్యాల బారిన పడవద్దని చెప్పారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్జీఓ సంఘ ప్రతినిధి అనీల్‌రాజు, జి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జార్జి ఫార్మసి కళాశాల విద్యార్థులతోపాటు సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గిద్దలూరు రూరల్: మత్తు పదార్థాలకు బానిసలవకుండా వాటికి దూరంగా ఉండాలని గిద్దలూరు రూరల్ సీఐ దాసరి ప్రసాద్ అన్నారు. మత్తు పదార్థాల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీసులు సెబ్ అధికారులు విద్యార్థులతో కలిసి బుధవారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాచర్ల గేటు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలతో జీవితాలను నాశనం చేసుకుంటారన్నారు. మత్తు పదార్థాల రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తుకు బానిసలై ఎందరో వారి జీవితాలను నాశనం చేసుకున్నారన్నారు. మత్తును నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. మత్తు పదార్థాలు కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని, అలాంటి వారి సమాచారం పోలీసులకు వెంటనే అందజేయాలని కోరారు. సెబ్ సీఐ కొండారెడ్డి, ఎస్సై తోట వెంకటేశ్వరరావు, సెబ్ ఎస్సై ఫణికుమార్, ఏఎస్సై జింకా లక్ష్మీరంగయ్య, పోలీసు సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.


పొదిలిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పొదిలి: యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో బుధవారం ప్రతిజ్ఞ చేశారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ బి.ఈశ్వరరావు మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, వినియోగదారుల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తారావాణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న సెబ్ డీఎస్పీ దుర్గాప్రసాద్, సీఐ, ఎస్సై తదితరులు

డ్రగ్స్ వాడితే భవిష్యత్ శూన్యం

● సెబ్ డీఎస్పీ దుర్గాప్రసాద్

మార్కాపురం: డ్రగ్స్ వాడిన వారికి భవిష్యత్ ఉండదని, యువత వీటి బారిన పడవద్దని సెబ్ డీఎస్పీ దుర్గాప్రసాద్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మార్కాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యాస్థులతో మాట్లాడుతూ కొందరు మానసిక ఒత్తిడి, సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారన్నారు. విద్యార్థులు కొత్త పరిచయాల ద్వారా చెడు వ్యసనాలతో డ్రగ్స్ తీసుకుంటున్నారన్నారు. వీటిని వాడటం వల్ల ఆర్థికంగా, ఆరోగ్యంగా, సామాజికంగా తీవ్రంగా నష్టపోతారన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల శరీరంలో నేరుగా మెదడు, కేంద్ర నాడీ వ్యవస్థపై ఎక్కువ ప్రభావం ఉంటుందని, ఇతర వ్యవస్థలపై కూడా చెడు ప్రభావాలు ఏర్పడి రోగ నిరోధక వ్యవస్థ, జీర్ణవ్యవస్థ పనితీరు దెబ్బతింటుందన్నారు. లివర్, ఊపిరితిత్తులు పాడవుతాయన్నారు. గంజాయి, హెరాయిన్, కొకైన్ లాంటి డ్రగ్స్ రవాణాచేసినా, అమ్మినా ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఒక్కసారి డ్రగ్స్ కేసులో పట్టుబడి పోలీసు రికార్డుల్లో నమోదైతే భవిష్యత్‌లో ఉద్యోగాలు రావని, పాసుపోర్టు వీసాలు రావన్నారు. విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలన్నారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్సై గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై శ్రీవారి దర్శనం


స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు


అశ్వ వాహనంపై శ్రీవారి ఊరేగింపు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న భూనీలా సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉదయం 6 గంటలకు స్వామివారికి అష్టోత్తర, సహస్ర నామార్చన పూజలు నిర్వహించారు. 9 గంటలకు చక్రస్నానం చేయించారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ టీపీ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎం.కొండలరావు, అధనపు కార్యదర్శి నిట్టూరి వెంకట రమేష్, కోశాధికారి వేముల పిచ్చిరావు, ప్రతినిధులు రావిపాటి రాజా, విట్టా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్

కంభం: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ షేక్ ఖాసింపీరా అన్నారు. స్థానిక నాయక్ వీధిలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. వైస్ చైర్మన్ రుక్సానా, ప్రధానోపాధ్యాయురాలు సాహెరా బేగం, రహమతున్నిసా బేగం పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎఫర్డ్ సంస్థ ప్రతినిధులు

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో అమెరికాకు చెందిన ఏకం సంస్థ ఆర్థిక సహకారంతో పీజీఎస్ఎఫ్ ఎఫర్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను రిలయన్స్ సంస్థ జిల్లా మేనేజర్ వెంకట బాబూరావు ప్రారంభించారు. ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను గ్రామస్తులంతా సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు కోరారు. ఎఫర్డ్ సంస్థ డైరెక్టర్ జేవీ మోహనరావు, సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు పెంచాలి


మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు పిడతల రమేష్‌రెడ్డి అన్నారు. అమ్మ కోసం ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీపాతాళనాగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో బుధవారం వారు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలయ పరిసర ప్రాంతంలో ఆహ్లాదకర వాతావరణం కోసం మొక్కలు నాటతామని చెప్పారు. ప్రతి ఒక్కరు వారి జీవితంలో ఒక్కసారైన మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. పర్యావరణాన్ని సంరక్షించే బాధ్యత మానవుడు తీసుకుంటే యావత్తు మానవాళి భవిష్యత్తు ఆనందదాయకంగా ఉంటుందన్నారు. మాజీ జెడ్పీటీసీ పిడతల సరస్వతి, బీజేపీ నాయకులు ఉదయ్‌శంకర్, దూదేకుల బాదుల్లా, మల్లారెడ్డి, వజ్రా ఆంజనేయులు, కొప్పుల నరసింహులు పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపడం బాధ్యత

యర్రగొండపాలెం: తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపడం బాధ్యతగా తీసుకోవాలని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని వీరభద్రాపురంలో జరిగిన నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలు బడికి వెళ్లడం మానేస్తే వారి సమస్య గుర్తించి తిరిగి వారు పాఠశాలలో చేర్పించే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పాఠశాలలో ఉండాల్సిన పిల్లలు బాల కార్మికులుగా పనులకు పంపించడం, బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, తమ పరిసర ప్రాంతాల్లో బాలబాలికలు పాఠశాలలకు వెళ్లని వారిని తిరిగి పాఠశాలలకు పంపించేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. బడి మానివేసిన పిల్లలు తిరిగి బడిలో చేరితే వారి వయసు ఆధారంగా తగు తరగతుల్లో చేర్పిస్తామని, వారు కోరుకుంటే హాస్టల్ వసతి, బాలికలకు కేజీబీవీ వంటి విద్యా సంస్థల్లో ప్రవేశం కల్పిస్తామన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం డి.మంత్రూనాయక్, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి నాయక్, దేవప్రసాద్, మంత్రూనాయక్, మల్లికార్జున్, జోజప్ప, పోతురాజు, నాగేశ్వరరావు నాయక్, శ్రీదేవి, లక్ష్మీదేవి, మూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాలలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో శామ్యూల్‌జాన్

పుల్లలచెరువు: పాఠశాలలోని రికార్డులను ఉపాధ్యాయులు సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో శామ్యూల్‌జాన్ అన్నారు. మండలంలోని ఐటీవరం పాఠశాలను ఎంఈవో శామ్యూల్‌జాన్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నూతన విద్యా విధానంలో పాఠాలు నేర్పించాలన్నారు. మధ్యాహ్న భోజనం కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలన్నారు. సమయపాలన పాటిస్తూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ బాలసుందరరావు

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులు, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. రహదారి ప్రమాదాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలీసు సిబ్బంది నిర్వహించిన విధుల పట్ల వారిని అభినందించారు. స్టేషన్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, కేసులు పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్ఐకి పలు సూచనలు చేశారు. ఈయన వెంట స్థానిక ఎస్ఐ ఫిరోజ్ ఫాతిమా పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌ల పంపిణీ

దొనకొండ: మండలంలోని అన్ని పాఠశాలలకు బుధవారం మండల విద్యాధికారులు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్‌బాషా స్టూడెంట్ కిట్‌లు పంపిణీ చేశారు. 5259 మంది విద్యార్థులకు యూనిఫామ్, బూట్లు, మిగిలిన పాఠ్య పుస్తకాలను ఆయా ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఏ పాఠశాలలోని విద్యార్థులకు సరిపడక పోతే త్వరలో అందజేస్తామని ఎంఈఓ తెలిపారు.

మానవ హక్కుల సంఘం నియోజకవర్గ చైర్మన్‌గా కిషోర్


కిషోర్‌కు నియామక పత్రం అందజేస్తున్న మల్లికార్జునరెడ్డి

పొదిలి: మానవ హక్కుల సంఘం, అవినీతి నిరోధక సంఘం మార్కాపురం నియోజకవర్గ చైర్మన్‌గా పట్టణానికి చెందిన జి.కిషోర్ నియమితులయ్యారు. ఈమేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు గుండారెడ్డి మల్లికార్జునరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కిషోర్ కృతజ్ఞతలు తెలిపారు. శక్తివంచన లేకుండా సంఘం కోసం పని చేస్తానని చెప్పారు.

అడవిపంది మాంసం కలిగిన వ్యక్తులు అరెస్టు

గిద్దలూరు రూరల్: అడవి పంది మాంసం కలిగిన ముగ్గురు వ్యక్తులను అటవీశాఖ అధికారులు బుధవారం అదుపులోనికి తీసుకున్నారు. మండలంలోని గడికోటకు చెందిన ఇద్దరు అంకణాంపల్లెకు చెందిన ఒకరు మొత్తం ముగ్గురు వ్యక్తులు దేవనగరం లింగాపురం గ్రామాల మధ్యలో అడవి పంది మాంసం కలిగి ఉండటం గమనించిన అటవీశాఖ అధికారులు వారిని అదుపులోనికి తీసుకున్నారు. ఈ ఘటనలో ఇంకా ఎవరిదైనా పాత్ర ఉందా అన్న కోణంలో విచారిస్తున్నారు. విచారణలో పూర్తి వివరాలను వెల్లడిస్తామని రేంజ్ ఆఫీసర్ కుమార్‌రాజు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలతో నారుమళ్లు పెంచాలి


నారుమడుల షెడ్ నర్సరీని పరిశీలిస్తున్న రమేష్

కొనకనమిట్ల: నర్సరీల్లో నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని నారు మడులు పెంచి రైతులకు అందజేయాలని ఉద్యానవనశాఖ అధికారి డి.రమేష్ పేర్కొన్నారు. బుధవారం కొనకనమిట్ల, కొత్తపల్లి సమీపంలోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిరపతో పాటు పలు రకాల నారు మడులు పెంచే వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. రైతులకు నారు విక్రయించేటప్పుడు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. నూతనంగా ఏర్పాటు చేసే నర్సరీలకు రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ లేని నర్సరీలకు నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో సాధన విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, డైరెక్టర్లు

మార్కాపురం: బుధవారం విడుదలైన ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో మార్కాపురంలోని శ్రీ సాధన కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కృష్ణారెడ్డి తెలిపారు. ఎంపీసీ విభాగంలో సీహెచ్ యశశ్రీ 470 మార్కులకుగాను 466 మార్కులు, బి.గోవర్ధిని 465, షేక్ హుస్సేన్ 464, కె.మల్లేశ్వరి 464 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఎంఈసీ విభాగంలో 500 మార్కులకుగాను 492 మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరిని కళాశాల డైరెక్టర్స్ వీఆర్‌కే ప్రసాద్, డి.రాజగోపాల్ రెడ్డి, డి.కృష్ణారెడ్డి, జి.లావణ్య రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాసులు అభినందించారు.

మాదక ద్రవ్యాల నివారణపై ఖైదీలకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఓంకార్

గిద్దలూరు రూరల్: మాదక ద్రవ్యాల అక్రమ రవాణకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవంపై స్థానిక సబ్‌జైలులోని ఖైదీలకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మాదకద్రవ్యాలతో శరీరంతో పాటు మానసికంగా బలహీనపడతారన్నారు. మత్తు పదార్థాల సమాజంలో చులకన భావం పొందుతారన్నారు. అన్ని అనర్థాలకు మత్తు పదార్థాలే కారణమన్నారు. అటువంటి మత్తు పదార్థాలకు బానిసలవకుండా వాటికి దూరంగా ఉండాలన్నారు. ఆలోచన శక్తిని కోల్పోయి విచక్షణారహితంగా ప్రవర్తించి జీవితాలను చేతులారా నాశనం చేసుకుంటారన్నారు. ఈ సందర్భంగా జైలులోని రికార్డులను, వారికి ఏర్పాటు చేస్తున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్యాంశాలు ప్రణాళికాబద్ధంగా బోధించాలి

● డిప్యూటీ డీఈఓ అనితారోజ్ రాణి


విద్యార్థులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఈఓ

కురిచేడు: పదో తరగతి విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాలు బోధించాలని డిప్యూటీ డీఈఓ జె.అనితారోజ్ రాణి ఆదేశించారు. స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణ ఉండాలని, ప్రణాళిక ప్రకారం ఏ రోజు సిలబస్ ఆ రోజు చదవాలని, పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించాలని ఆమె విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణతో మెలిగితే విద్యాబుద్ధులతో పాటు తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు వస్తుందని చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు అవసరమైతే అదనపు తరగతులు నిర్వహించాలన్నారు. ఆమె వెంట ఎంఈఓలు, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.